www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 4 ఆగస్టు 2024

5

తూర్పుగోదావరి

జాబ్ మేళాలో 130 మంది ఎంపిక

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో శనివారం నిర్వహించిన జాబ్ మేళాలో జిల్లావ్యాప్తంగా వివిధ కళాశాలల నుంచి 182 మంది విద్యార్థులు హాజరవగా, 130 మంది విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కె ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో 10 కంపెనీల ప్రతినిధులు హాజరై విద్యార్థులకు మౌఖిక పరీక్షలు నిర్వహించారని కళాశాల జెకెసి కో ఆర్డినేటర్ డాక్టర్ బి.హరినాథ్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన ప్రారంభ సభలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ, జాబ్ మేళాలో ప్రతి విద్యార్థీ ఈ ఉద్యోగావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ జాబ్ మేళాలో కళాశాల జెకెసి కమిటీ సభ్యులు, ప్లేస్‌మెంట్ ట్రైనర్ ఎం.కిరణ్ కుమార్, డి.కిరణ్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు

- కూటమి సర్కారులోనూ కక్ష సాధింపు చర్యలు
- అక్రమ తొలగింపులకు పాల్పడుతున్న వైనం
- వేధింపులపై 5న వర్కర్ల ధర్నా

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

కూటమి సర్కారు అధికారం చేపట్టి రెండు నెలలు గడవక ముందే స్కీమ్ వర్కర్లపై వేధింపులు మొదలయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో విధుల్లో చేరిన వారందరినీ టిడిపి, జనసేన నేతలు టార్గెట్ చేస్తూ పలువురిని అక్రమంగా తొలగిస్తున్నారు. విధులనుంచి తప్పించి తీరాల్సిందేనంటూ అధికారులపై తీవ్ర ఒత్తిళ్లు చేస్తున్నారు. తమ సొంత పార్టీ వారిని నియమించుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే అనేక మందిని అక్రమంగా తొలగించగా, మిగిలిన వారిపై బెదిరింపులకు పాల్పడుతున్నారు. పొమ్మనకుండా పొగ పెట్టే ప్రయత్నాలు పలుచోట్ల సాగుతున్నాయి. ప్రస్తుతం పని చేస్తున్న వారిని తొలగించి, వారికి అనుకూలంగా ఉన్న వారిని నియమించేందుకు రాజకీయ నాయకులు భారీగా సొమ్ములు కూడా దండుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉద్దేశపూర్వకంగానే కూటమి కార్యకర్తలు కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నా అధికారులు ప్రేక్షక పాత్రకే పరిమితమవుతున్నారు. ఈ వ్యవహారాలన్నీ ఆయా నియోజకవర్గాల ఎంఎల్ఎల దృష్టికి వెళుతున్నా వేధింపులకు పాల్పడుతున్న వారికే మద్దతుగా మాట్లాడుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సిఐటియు ఆధ్వర్యంలో ఈ నెల 5న జిల్లా కలెక్టరేట్ల వద్ద స్కీమ్ వర్కర్లంతా కలిసి పెద్ద ఎత్తున ధర్నా చేపట్టనున్నారు. అంగన్వాడీ, ఆశ, యానిమేటర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్మికులు ఆందోళనలో పాల్గొననున్నారు.

కొనసాగుతున్న అక్రమ తొలగింపులు

గత వైసిపి పాలనలో స్కీమ్ వర్కర్లపై ఇలానే వేధింపులు, రాజకీయ కక్ష సాధింపులు, అక్రమ తొలగింపులు జరిగాయి. దీంతో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఉద్యోగులతో పాటు వివిధ ప్రభుత్వ పథకాలలో పనిచేస్తున్న స్కీమ్ వర్కర్లు సైతం కూటమి ప్రభుత్వానికి మద్దతుగా నిలిచి వైసిపికి తగిన గుణపాఠం చెప్పారు. రెండు నెలలు కూడా గడవక ముందే అధికార పార్టీకి చెందిన స్థానిక రాజకీయ నాయకులు అక్రమ తొలగింపులకు దిగుతున్నారు. ప్రధానంగా వెలుగు విఒఎలను ఇప్పటికే కొన్నిచోట్ల తొలగించారు. విధుల్లో నుంచి తప్పుకోవాల్సిందవగా ఇళ్లకు వెళ్లి బెదిరిస్తున్నారు. దీంతో ఇటీవల కలెక్టరేట్ వద్ద యానిమేటర్లంతా సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా కూటమి కార్యకర్తలు వేధింపులు ఆపలేదు. కాకినాడ రూరల్ మండలంలో 14 మందిని, పిఠాపురం మండలంలో 9 మందిని, కాజులూరు మండలంలో నలుగురు విఒఎలను రాజకీయ కారణాలతో తొలగించారు. యు.కొత్తపల్లి మండలంలో రాజీనామాలు చేయాలని టిడిపి నేతలు ఆరుగురిని బెదిరిస్తున్నారు. రౌతులపూడి మండలంలో 20 మందిని తొలగించేందుకు రంగం సిద్ధం చేశారు. అక్కడ టిడిపి నాయకులు అధికారులపై తీవ్ర ఒత్తిడి చేస్తున్నారు. దానితో విఒఎల విధులకు సంబంధించి లాగిన్‌లు నిలిపివేశారు. తుని పట్టణంలో ఇప్పటికే ఒక ఆర్‌పిని తొలగించగా, మరో ఐదుగురిని తప్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. జగ్గంపేట, ఏలేశ్వరంలో బెదిరింపులకు పాల్పడుతున్నారు. తాళ్లరేవులో కంటింజెన్సీ వర్కర్లపై స్థానిక టిడిపి నేతలు బెదిరింపులకు దిగుతున్నట్లుగా ఆరోపణలు ఉన్నాయి. కరప మండలం పెద్దాపురప్పాడులో ఇద్దరు మధ్యాహ్న భోజన కార్మికులను ఇప్పటికే తొలగించారు. జగ్గంపేట వెంగాయమ్మపురం పాఠశాలలో ఒక మిడ్ డే మీల్ కార్యకర్తపై స్థానిక టిడిపి కార్యకర్త వీరబాబు వేధింపులకు దిగుతున్నాడు. తుని మండలంలో మధ్యాహ్న భోజన కార్మికులపై కక్షపూరిత చర్యలు కొనసాగుతున్నాయి. రౌతులపూడి మండలం ములగపూడిలో ఒక ఆశా వర్కర్‌ను తొలగించేందుకు స్థానిక టిడిపి నేతలు విశ్వ ప్రయత్నాలు సాగిస్తున్నారు. అటు తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం అచ్చన్నపాలెంలో ఒక అంగన్వాడీ హెల్పర్ రాజకీయ వేధింపులు తాళలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యా ప్రయత్నం చేశారు. సకాలంలో వైద్య సాయం అందించడంతో ప్రాణాపాయం నుంచి బయటపడింది. కొవ్వూరు మండలం దొమ్మేరులో ఆరుగురుని, ఇదే మండలం మద్దూరులంకలో ఒకరిని విధుల నుంచి తొలగించారు. ఎన్నికల్లో వైసిపి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారంటూ వారిపై నిందలు వేస్తూ విధుల నుంచి తొలగిపోవాలని స్థానిక టిడిపి నేతలు ఒత్తిడి చేస్తున్నారు. దీనిపై స్థానిక ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావును సిఐటియు నాయకులు కలిసి సమస్యలు విన్నవించినా ఫలితం లేకపోయింది. ఎటువంటి బలమైన కారణాలు లేకుండా కేవలం తమ సొంత వారిని నియమించుకునేందుకు ఇలా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అనేక చోట్ల రాజకీయ కక్ష సాధింపు చర్యలు కొనసాగుతున్నాయనే విమర్శలు పెద్ద ఎత్తున వెల్లువెతుతున్నాయి.

ఉద్యోగ భద్రత వాగ్దానం మరిచిపోయారా..?

ప్రభుత్వం మారింది కాబట్టి మా కార్యకర్తలను మీ స్థానంలో నియమిస్తాం, మీరు రాజీనామా చేయండని స్థానిక తెలుగుదేశం, జనసేన నాయకులు స్కీమ్ వర్కర్లపై ఒత్తిడి చేస్తున్నారు. ఎన్నికల ముందు ఉద్యోగ భద్రత కల్పిస్తామని చెప్పిన వాగ్దానాన్ని మర్చిపోయారా. కూటమి నాయకులను కంట్రోల్ చేయాలి. లేకపోతే వైసిపికి పట్టిన గతే టిడిపికి కూడా పడుతుందని గ్రహించాలి. ఇప్పటికైనా రాజకీయ వేధింపులు, అక్రమ తొలగింపులు నిలుపుదల చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తాం.

- జి.బేబీరాణి, సిఐటియు ఆలిండియా ఉపాధ్యక్షులు.

వేధింపులకు వ్యతిరేకంగా ఇటీవల కాకినాడలో ఆందోళన చేసిన స్కీమ్ వర్కర్లు (ఫైల్ ఫొటో)

కలెక్టరేట్‌లో అధికారులు, నర్సరీల యాజమాన్యాలతో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

పర్యాటకంగా కడియం నర్సరీల అభివృద్ధి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

కడియం నర్సరీలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి కందుల దుర్గేష్ చెప్పారు. కలెక్టరేట్‌లో శనివారం నర్సరీ అసోసియేషన్ సభ్యులు, కలెక్టర్ పి.ప్రశాంతి, ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరితో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడారు. కడియం నర్సరీలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయని, వీటిని ఆకర్షణ కేంద్రంగా తీర్చి దిద్దాలంటే అదనపు సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ ప్రాంతాన్ని పర్యటక కేంద్రంగా అభివద్ధి చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి తెలిపారు. పూల నుంచి సుగంధ ద్రవ్యాలు తయారు చేసేందుకు నర్సరీ యాజమాన్యాలు ముందుకు రావాలని ఆయన సూచించారు. ఈ ప్రాంతం అభివృద్ధికి రహదారుల నిర్మాణం అత్యంత ప్రధానమైనదని తెలిపారు. అందుకోసం నర్సరీ యాజమాన్యాలు ఆక్రమణలు తొలగింపునకు ప్రభుత్వం యంత్రాంగానికి సహకరించాలని కోరారు. నర్సరీ అసోసియేషన్ ప్రతినిధులు సత్యనారాయణ, ఇన్‌ఛార్జి జెసి జి.నరసింహులు, టూరిజం ఆర్‌డి వి.స్వామి నాయుడు, పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక కార్యాచరణ

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

నగర పరిధిలో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక కార్యచరణ రూపొందించినట్లు మున్సిపల్ కార్పొరేషన్ శానిటరీ సూపర్‌వైజర్ ఐ.శ్రీనివాస్ తెలిపారు. కొన్ని రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించామని అన్నారు. నగరంలోని 52 డివిజన్లలోని 26 క్లస్టర్ల పరిధిలో ఖాళీ స్థలాల్లో చెత్తను ఇప్పటికే 100 శాతం తరలించామన్నారు. డోర్ టు డోర్ చెత్త సేకరణ 100 శాతం అమలు జరుగుతోందన్నారు. చెత్త సేకరణ వాహనాల ద్వారా నివాస ప్రాంతాల్లో ఉదయం వేళల్లోనూ, వాణిజ్య ప్రాంతాల్లో ఉదయం, సాయంతం వేళల్లో చెత్త సేకరణ జరుగుతోందని తెలిపారు. సైడు కాల్వల్లో డీ సిల్టేషన్ చేయడంతో పాటు దోమల నియంత్రణకు ఫాగింగ్, యాంటీ లార్వా స్ప్రేయింగ్ చేయిస్తున్నట్లు చెప్పారు.

ప్రశ్నించే తత్వం ఉండాలి

ప్రజాశక్తి-కడియం

ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే ప్రశ్నించే తత్వాన్ని అలవాటు చేసుకోవాలని గార్డ్స్ ఫర్ ఆర్‌టిఐ జాతీయ కన్వీనర్ వరదా నాగేశ్వరరావు అన్నారు. శనివారం కడియం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో నాగేశ్వరరావు మాట్లాడారు. సమాచార హక్కు చట్టం సామాన్యుడి చేతిలో బ్రహ్మాస్త్రం వంటిదని, సామాన్యులు మొదలు పండితులు వరకు ప్రతి ఒక్కరూ దీని గురించి తెలుసుకోవాలన్నారు. మహిళా కన్వీనర్ ఆకుల విజయభారతి, ప్రముఖ న్యాయవాది తోరాటి వసంతరావు, మహిళా న్యాయవాది శిరీష మాట్లాడారు.

బాలునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -దేవరపల్లి

మండలంంలోని దుద్దుకూరు గ్రామానికి చెందిన ఉండ్రాజవరపు కృష్ణ కుమారుడు లిఖిత్ కిరణ్ తలసేమియా వ్యాధితో బాధ పడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు ముళ్ళపూడి దొరాజీ చౌదరి బాలునివైద్య ఖర్చుల నిమిత్తం రూ.25 వేల ఆర్థిక సాయం అందించారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి-తాళ్లపూడి, సీతానగరం

తాళ్లపూడి వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు తెలుగు అకాడమీ పుస్తకాలను నాయకులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపల్ గరగ శ్రీనివాసరావు, టిడిపి నాయకులు కైగాల శ్రీనివాస్ పాల్గొన్నారు. సీతానగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాజానగరం ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ పుస్తకాలను పంపిణీ చేశారు.

స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లపై సమీక్ష

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ఆగస్టు 15న ఆర్ట్స్ కళాశాల మైదానంలో స్వాతంత్ర దినోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖలూ తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో వేడుకల నిర్వహణకు సంబంధించి ఎఎస్‌పి ఎస్‌ఆర్.రాజశేఖర్, ఇన్‌ఛార్జి జెసి, డిఆర్‌ఒ జి.నరసింహులు వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో వ్యవహరించి ఆగస్టు 15 వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆయా శాఖల పరిధిలో అత్యుత్తమ సేవలందించిన వారి పేర్లనే అవార్డులకు సిఫార్సు చేయాలని సూచించారు. అవార్డుకు గౌరవం పెరిగే విధంగా ఉత్తమ పనితీరు కనబరిచిన వారిని మాత్రమే గుర్తించి పేర్లను ఈ నెల 10వ తేదీలోగా పంపించాలన్నారు. వేడుకల్లో భాగంగా చిన్నారులు, విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేలా సాంస్కృతిక కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతా పథకాలతో కూడిన శకటాల ప్రదర్శన, స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఆయా విభాగాల పరిధిలో ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, కెఆర్‌సిసి డిప్యూటీ కలెక్టర్ నాయక్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

జేగురుపాడులో సిసి కెమేరాల ఏర్పాటు

ప్రజాశక్తి-కడియం

మండలంలోని జేగురుపాడులోలో సర్పంచ్ యాదల సతీష్ చంద్ర స్టాలిన్ సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు. ఇటీవల గ్రామంలో దొంగతనాలు అధికమవ్వడం, గతంలో పొలాలలో పశువులను దొంగలు తరలించుకుపోయారని సర్పంచ్ తెలిపారు. కొన్ని కేసుల్లో ఇప్పటికీ జాడ తెలియ రాలేదని సర్పంచ్ పేర్కొన్నారు. కెనాల్ రోడ్డు లోని బ్రిడ్జి సెంటర్లో శనివారం కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇదే మార్గంలో ప్రతి రోజూ విద్యార్థులు, రైతులు, కార్మికులు వందల సంఖ్యలో వెళతారని వారితో పాటు గ్రామ ప్రజలకు భద్రతగా ఉంటుందని అన్నారు.

ముగిసిన ఎటిఎల్ ఇన్‌ఛార్జిల శిక్షణ

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ధవళేశ్వరం జెడ్‌పి పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్ రీజియన్ ఇన్‌ఛార్జిలకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలు శనివారంతో ముగిశాయి. జిల్లా పాఠశాల విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావు మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు సమగ్రంగా అందచేయాలని కోరారు. ఈ శిక్షణా కార్యక్రమంలో పది జిల్లాల నుండి 50 మంది పాల్గొన్నారు.

ఎర్ర కాలువ ముంపు నివారణకు చర్యలు

ప్రజాశక్తి- గోపాలపురం, దేవరపల్లి

ఎర్ర కాలువ, కొవ్వాడ, తాడిపూడి కాలువల వరద ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎంఎల్ఎ మద్దిపాటి వెంకట రాజుతో కలిసి వరద ముంపునకు గురైన గౌరీపట్నం, వెంకటాయపాలెం గ్రామాల్లో నీట మునిగిన పంట పొలాలను ఎంపీ పరిశీలించారు. రైతులను పరామర్శించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ పంట ముంపు పొలాలపై అధికారులు ప్రాథమిక అంచనా వేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు బొమ్మల దత్తు, వ్యవసాయ శాఖ ఎడి పి.చంద్రశేఖర్, ఎఒ బి.రాజారావు, పాల్గొన్నారు.

గోపాలపురం ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎంపీ

అవయవ దానంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-గోపాలపురం

మరణించిన తర్వాత అవయవాలు దానంతో మరొకరిని బతికించేందుకు దాతలు ముందుకు రావాలని బాలల పరిరక్షణ అధికారి సి.రాజకుమార్, బాలల పరిరక్షణ విభాగం ప్రొటెక్షన్ ఆఫీసర్ జి.క్రాంతిలాల్ అన్నారు. శనివారం స్థానిక గౌతమీ జూనియర్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఐసిడిఎస్ సిడిపిఒ యువి.పద్మావతి అధ్యక్షతన అవయవదాన వేడుకలను పురస్కరించుకుని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏటా అవయవాలు దొరకక చాలామంది మరణిస్తున్నారని తెలిపారు. వారిలో ప్రతిఒక్కరికీ అవగాహన కల్పంచాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. అనంతరం బేటీ బచావో బేటీ పడావో గురించి వివరించారు. సిహెచ్‌సి వైద్యాధికారి యు.రాణి మాట్లాడారు.

అవయవ దానంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పోలీసుల చొరవతో గోతులకు మరమ్మతులు

ప్రజాశక్తి-గోపాలపురం

దేవరపల్లి నుండి తల్లాడ నేషనల్ హైవే రోడ్డు మార్గంలో గోపాలపురం శివారు తాడిపూడి వంతెనపై ప్రమాదకరంగా ఉన్న గోతులను ఎస్ఐ కె.సతీష్ కుమార్ చొరవతో శనివారం మరమ్మత్తులు చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు, భారీ వాహనాలు తిరగడంతో నేషనల్ హైవే రోడ్డు మార్గంలో తాడిపూడి కాలువ వంతెనపై గోతులు ఏర్పడి ఐరన్ ఊచలు పైకి లేచి ఉండడంతో ప్రమాదకరంగా మారింది. ఆ గోతుల్లో వర్షపు నీరు చేరడంతో ద్విచక్ర వాహనదారులు ఆ గోతుల్లో అదుపుతప్పి పడుతున్నట్లు వాహన చోదకులు తెలిపారు. భారీ వాహనాలు సైతం గోతులను గమనించకపోవడంతో వాహనాలు అదుపు తప్పుతున్నట్లు తెలిపారు. దీంతో అక్కడ ప్రమాదం పొంచి ఉండడంతో మరమ్మతులు చేసి పూడ్చారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రజా దర్బార్

ప్రజాశక్తి - సీతానగరం

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని రూపొందించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ ప్రజల వద్ద నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అప్పటికప్పుడే అధికారులతో మాట్లాడారు. రాజానగరం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన కర్తవ్యం ఎంఎల్ఎ చెప్పారు. ఈ ప్రజాదర్బార్‌లో మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ పలు అంశాలపై ఎంఎల్ఎకు అర్జీ అందజేసారు. రఘుదేవపురంలో వైసిపి ప్రభుత్వ హయాంలో ఎన్‌టిఆర్ విగ్రహావిష్కరణకు వచ్చిన నారా లోకేష్‌పై కొందరు గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసిన ఘటనకు సంబంధించి దర్యాప్తు చేయాలని కోరారు. జైకా నిధులపై విచారణ జరిపించాలని, తొర్రిగడ్డ లైనింగ్ పనులు పూర్తి చేయాలని, బొబ్బిల్లంక నుంచి సీతానగరం వరకు జరిగిన రోడ్డు వెడల్పు పనుల్లో అక్రమాలపై దర్యాప్తు చేయాలన్నారు. కోరుకొండ నుంచి ముగ్గళ్ళ వరకు జరిగిన రోడ్డు వెడల్పు పనులకు తీసుకువచ్చిన గ్రావెల్‌లో అవినీతిపై విచారణ జరిపించాలన్నారు.

డ్రైన్ నిర్మాణానికి సన్నాహాలు

ప్రజాశక్తి-తాళ్లపూడి

తాళ్లపూడి మెయిన్ బజార్లో డ్రైన్ నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నట్లు ఎంపిపి జొన్నకూటి పూసిరాజు తెలిపారు. మండల కేంద్రమైన తాళ్లపూడి మెయిన్ బజార్ వ్యాపార కేంద్రంగా ప్రారంభం కాక ముందు ఉన్న పక్కా డ్రైన్ భవన యజమానుదారులు ముందుకు చొచ్చుకు రావడంతో మూసుకుపోయింది. ఈ కారణంగా కనీసం వర్షపు నీరు కూడా బయటకి పోయే మార్గం లేదు. డ్రైన్ ఆనవాళ్లను శనివారం ఎంపిపి పోసిరాజు, ఎంపిడిఒ రమణ పంచాయతీ కార్యదర్శి ఆశ అలేఖ్య పరిశీలించారు.



ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

పలుచోట్ల శనివారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు.

ప్రజాశక్తి -యంత్రాంగం

గోకవరం కామరాజుపేట అంగన్‌వాడీ సెంటర్‌లో కోరుకొండ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఎసిడిపిఒ పి.వరలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పి గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపు తల్లి ముర్రిపాలు పట్టించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ పి.చంద్రమ్మ, కార్యకర్తలు ఎం.మాలతి, కె.సుబ్బలక్ష్మి, టి.శ్రీదేవి, లోవమ్మ, కె.లక్ష్మీకుమారి, హెచ్‌ఎం ఈశ్వరీ దేవి పాల్గొన్నారు. **చాగల్లు** మీనానగరం, చిక్కాల గ్రామాల్లో సెక్టార్ సూపర్వైజర్ టి.పద్మావతి తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. **గోకవరం** బావాజీపేటలో సూపర్వైజర్ పి.ఇందిరా రాణి ఆధ్వర్యంలో తల్లిపాల అవశ్యకతను వివరించారు. **తాళ్లపూడి** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హారికా గుప్తా వేగేశ్వరపురంలో తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. హెల్త్ విజిటర్ వేదకుమారి, సూపర్వైజర్ భానుమతి పాల్గొన్నారు. **ఉండ్రాజవరం** సిడిపిఒ శ్రీలక్ష్మి మోర్త గ్రామంలో తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్నారు.

వరల్డ్ క్లాస్ రైల్వే స్టేషన్‌గా అభివృద్ధికి చర్యలు

రాజమహేంద్రవరం రూరల్ : రాజమండ్రి రైల్వే స్టేషన్‌ను వరల్డ్ క్లాస్ స్టేషన్‌గా తీర్చిదిద్దనున్నట్లు ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి చెప్పారు. ఎంఎల్ఎలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తదితరులతో కలిసి రైల్వే ఉన్నతాధికారులతో శనివారం ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం రోజువారీ 32 వేల నుంచి 33 వేల మంది ప్రయాణికులు స్టేషన్‌కు వస్తున్నారని అంచనా ఉందని తెలిపారు. స్టేషన్ ఆధునికీకరణ మాత్రమే కాక ప్రయాణికులకు అన్ని సౌకర్యాలూ కల్పించనున్నట్లు ఎంపీ పురందేశ్వరి తెలిపారు. 2027 పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులు పూర్తి చేయనున్నట్లు ఆమె తెలిపారు.

రాజయ్యకు నివాళి అర్పిస్తున్న సిపిఎం నాయకులు అరుణ్ తదితరులు

సున్నం రాజయ్య సేవలు వెలకట్టలేనివి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

మాజీ ఎంఎల్ఎ సున్నం రాజయ్య సేవలు వెలకట్టలేనివని పలువురు కొనియాడారు. రాజాయ్య 4వ వర్ధంతి సందర్భంగా సిపిఎం కార్యాలయంలో శనివారం ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడుతూ రాజయ్య పార్టీ గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర నాయకునిగా ఉద్యమ ప్రస్థానాన్ని కొనసాగించారన్నారు. రాజయ్య ప్రజల మనిషిగా ఉన్నారన్నారు. గిరిజన ఉద్యమాల నుంచి కార్మికు ఉద్యమాల వరకు అన్నింటిలోను సమరశీల పాత్ర పోషించారని కొనియాడారు. మూడుసార్లు భద్రాచలం ఎంఎల్ఎగా పని చేసినా ఏమాత్రం గర్వం లేకుండా ఆదర్శ జీవితాన్ని గడిపారన్నారు. తుది శ్వాస విడిచేవరకు ప్రజా సంక్షేమమే లక్ష్యంతో పని చేశారని అన్నారు. సిపిఎం నగర కార్యదర్శి బి.పవన్, తులసి, రాజా, భాస్కర్, భూషణం, అశోక్ పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగం అవాస్తవం

ప్రజాశక్తి - సీతానగరం

నిధులు దుర్వినియోగం అంటూ వచ్చిన ఆరోపణలు అవాస్తవం అని మాజీ ఉప సర్పంచ్ కాండ్రు శ్రీనివాసరావు తెలిపారు. శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2013లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రూ.2.25 కోట్ల ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులు రఘుదేవపురం పంచాయతీకి మంజూరయ్యాయన్నారు. వాటితో రోడ్లు, డ్రైనేజీలు, సిసి రోడ్లు, రఘుదేవపురం శ్వశానం రోడ్డు వంటివి నిర్మించామన్నారు. అప్పటి పాలకవర్గం తీర్మానం మేరకే పనులు చేసినట్టు తెలిపారు. పంచాయితీ పరిధిలో ఏవిధమైన ఇసుక ర్యాంపులూ నిర్వహించలేదని తెలిపారు. ఈ సమావేశంలో కొండ్రు బుజ్జి, పసలపూడి రామారావు, ఎలమాటి వీర్రాజు, మునికోటి అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ ఎంపిక

ప్రజాశక్తి-గోకవరం

గోకవరంలో శనివారం మండల హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీని ఎంపిక చేశారు. ఈ కమిటీలో మండల అధ్యక్షునిగా జి.బాపిరాజు, సెక్రెటరీగా పిల్లా సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీగా దాసరి నరసింహంను నియమించారు. ఎస్ఐ నాగరాజు, హ్యూమన్ రైట్స్ ఎపి స్టేట్ కో ఆర్డినేటర్ పల్లా రాము ద్వారా కమిటీ సభ్యులకు ఐడి కార్డులు ఇచ్చారు.

సీజనల్ వ్యాధుల పడగ

ప్రజాశక్తి – రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో సీజనల్ జ్వరాలు, ఇతర ఇన్ఫెక్షన్లు పడగ విప్పుతున్న నేపథ్యంలో ప్రజల్లో భయాందోళన నెలకొంది. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా మారిన విషయం విధితమే. దీంతో దోమలు విజృంభిస్తున్నాయి. వారం రోజుల్లో ఉమ్మడి జిల్లా కేంద్రాల్లోని ప్రభుత్వ ఆస్పత్రులు కిట కిటలాడుతున్నాయి. పల్లెల్లో వైద్య సౌకర్యాలు పూర్తి స్థాయిలో అందుబాటులో లేకపోవటంతో రోగులు ప్రయివేటు వైద్యులను ఆశ్రయించక తప్పటంలేదు. రక రకాల పరీక్షల పేరుతో ప్రయివేటు ఆస్పత్రుల యాజామాన్యాలు సామాన్యుల జేబులకు చిల్లుపెడుతున్నాయి. ప్రతి ఐదు కుటుంబాలలో ఇద్దరు లేక ముగ్గురు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. పాలనా యంత్రాంగం ఆ దిశగా చర్యలు తీసుకుని ప్రభుత్వ ఆస్పత్రులలో వైద్యం చేరువ చేయటంతోపాటు పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు పారిశుధ్య నిర్వహణకోసం ప్రత్యేక కార్యచరణ ప్రకటించినా క్షేత్రస్థాయి సిబ్బంది కొరత వేధించటంతో ఏ మేరకు ఫలితాలువ వస్తాయో వేచి చూడాల్సి ఉంది.

ఊరట ఇవ్వని రేషన్

నిత్యావసర సరుకుల ధరలు కిందకు దిగనంటున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పాలక ప్రభుత్వం ప్రజలకు ఊరట కల్పించాల్సిన బాధ్యతను విస్మరించింది. కేవలం రూ.5 వ్యవత్యాసంతో బియ్యం, కందిపప్పు విక్రయాలు చేపట్టి విస్తృత ప్రచారం చేసుకోవటం విస్మయానికి గురిచేస్తోంది. గతంలో రేషన్ డిపోల ద్వారా 11 రకాల సరుకులు సరఫరా చేసిన విషయం విధితమే. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కూటమి పార్టీలు ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేస్తామని ప్రకటించాయి.. ఆచరణలో భిన్నమైన విధానాలను అవలంబించటంతో ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. గత రెండు నెలలుగా చక్కెర పంపిణీ నిలిచిపోయింది. కందిపప్పు సరఫరాపై ఇప్పటికీ స్పష్టత కొరవడింది. గోధుమ పిండి సరఫరాపైనా నీలి నీడలు కమ్ముతున్నాయి. డిమాండ్‌కు సరఫరాకు పొంతన లేకపోవటమే ఈ దుస్థితికి కారణం. పాలకులు ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

వరద తగ్గుముఖం పట్టడంతో ఊరట

గోదావరి నది వరద తగ్గుముఖం పట్టడంతో పరివాహక ప్రాంతాల ప్రజలకు ఊరట లభించింది. గత 10 రోజులుగా గోదావరి వరద తగ్గుతూ...పెరుగుతూ కంటిమీద కునుకు లేకుండా చేసింది. తాజాగా వారాంతంలో తగ్గుముఖం పట్టడంతో లంక గ్రామాలు జల దిగ్బంధం నుంచి బయటపడ్డాయి. గతేడాది జూన్ రెండో వారం మొదలుకుని సెప్టెంబరు వరకూ భారీ స్థాయిలో

వచ్చిన వరదలు లంక గ్రామాలను రోజుల తరబడి జల దిగ్బంధానికి గురి చేసిన విషయం విధితమే. జులై నెలలో 20రోజులకు పైగా వరద ఉధృతి కొనసాగింది. తిరిగి అగస్టు నెలలోనూ గోదావరి నదికి వరద పోటెత్తే అవకాశాలు నెలకున్నాయి. ఏటి గట్ల బలోపేతం హామీ నీటి మీద రాతలుగా మిగిలితున్నాయి. నూతన ప్రభుత్వమైనా ఆ దిశగా చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

రైతుల్లో ఆందోళన

పంట కాల్వల ఆధునీకరణ పనులు చేపట్టకపోవటంతో వర్షపు నీరు పంటపొలాల్లో నిలిచి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుర్రపు డెక్క, తూటు, ఇతర చెత్తను తొలగింపు పనులకు నిధులు కేటాయించినా నతత్తనడకన పనులు సాగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో 5.54 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. తాజాగా కురిసిన వర్షాలు, వరదల నేపథ్యంలో నారు దశలోనే లక్షలాది ఎకరాల్లో రైతులు పంటనష్టం తప్పలేదు. పంటకాలువలు ఆధునీకరణ, మీడియం, మైనర్ మేజర్ డ్రెయిన్లలో పూడిక తీత పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి – మామిడికుదురు

పి.గన్నవరం డొక్కా సీతమ్మ అక్విడక్ట్ బ్రిడ్జిపై నుంచి గుర్తు తెలియని వ్యక్తి గోదావరిలోకి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. శనివారం ఉదయం జరిగిన ఈ సంఘటనపై స్థానిక మత్స్య కారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘట న సలానికి పి.గన్నవరం ఎస్ఐ, తహశీల్దార్ చేరు కుని ఎన్‌డిఆర్ఎఫ్ బందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చెప్పులు, ఖాకి చొక్కా గుర్తించారు. ఆ వ్యక్తి కోసం ఎవరూ ఫిర్యాదు చేయలేదని ఎస్ఐ తెలిపారు.

ఆర్ఎస్ఐపై కేసు నమోదు

ప్రజాశక్తి – రాజోలు

నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసి ఒక వ్యక్తికి హాని కలిగించేలా వ్యవహరించిన విజయవాడలో ఆర్ఎస్ఐగా పనిచేస్తున్న పొన్నమండ గ్రామానికి చెందిన ఆర్ఎస్ఐ కుక్కల లెనిన్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. గత నెల 30న పొన్నమండ ఫీల్డ్ లేబర్ సొసైటీ అధ్యక్షుడు కుసుమ రాజ్‌కుమార్ తన మనుమడితో కలసి మోటర్ సైకిల్‌పై వస్తుండగా ఇదే గ్రామానికి చెందిన లెనిన్ ఉదేశ్య పూర్వకంగా ఆంజనేయ స్వామి గుడి సమీపంలో రాంగ్ రూట్‌లో వచ్చి ఢీకొట్టినట్లు రాజ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

యూనివర్శిటీ అధికారులు, రిలయన్ ప్రతినిధులు

జెఎన్‌టియుకెలో వృక్షాలను కాపాడుతాం

ప్రజాశక్తి – కాకినాడ

జెఎన్‌టియుకెలో వృక్షాలను కాపాడుతామని యూనివర్శిటీలో ఇన్‌ఛార్జ్ ఉపకులపతి, ప్రొఫెసర్ కెవిఎస్‌జి.మురళీకృష్ణ అన్నారు. శనివారం యూనివర్శిటీలో రిలయన్స్ సంస్థకు చెందిన కాకినాడ అసెట్ టెక్నికల్ హెడ్ వేణుగోపాలరాజు, సిఎస్ఆర్ హెడ్ పి.సుబ్రహ్మణ్యంలతో కలిసి ఆయన పురాతన వృక్షాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జ్ విసి మురళీకృష్ణ మాట్లాడుతూ వారసత్వ సంపద పరిరక్షణలో భాగంగా యూనివర్శిటీలోని పురాతన వృక్షాలను సంరక్షించాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. విశ్వవిద్యాలయంలోని అతి పెద్ద వక్షాలను ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు అందంగా తీర్చిదిద్ది అనుబంధ కళాశాలలకు ఆదర్శంగా చూపిస్తామన్నారు. జెఎన్‌టియుకెని గ్రీన్ క్యాంపస్‌గా తీర్చిదిద్దేందుకు రిలయన్స్ సంస్థ సహకారం తీసుకుంటున్నామన్నారు.ఈ కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ కెవి.రమణ, ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్, ఒఎస్‌డి.కోటేశ్వరరావు, చీఫ్ ఇంజనీర్ వి.శ్రీనివాసులు, ఎఇలు సిహెచ్. సన్నీఫ్రాన్సిస్, బి.నవీన్ పాల్గొన్నారు.

ఆపద నుంచి బయట పడ్డాం

ప్రజాశక్తి – జగ్గంపేట

స్థానిక సత్య దేవ నర్సింగ్ హోమ్ అధినేత డాక్టర్ ప్రసాద్ ఇటీవల కుటుంబ సభ్యులతో కలిసి కేదర్నాథ్ యాత్రకి వెళ్ళారు. అయితే అక్కడ వాతావరణం అనుకూలించకపోవడంతో వారు అక్కడే చిక్కుకున్నారు. దీంతో ప్రసాద్ స్థానిక ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూకు చరవాణి ద్వారా సమాచారం అందజేయడంతో కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకి విషయం తెలియజేయడంతో కేదర్నాథ్‌లో చిక్కుకున్న ప్రసాద్ కుటుంబ సభ్యులను యంత్రాంగం రక్షించినట్లు ప్రసాద్ ఒక వీడియోను స్థానిక మీడియాకు పంపించారు. ప్రాణపాయం నుంచి బయట పడ్డామని, తమని రక్షించిన ఎంఎల్ఎ జ్యోతుల, మంత్రి రామ్మోహన నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

వేతనాల పెంపుపై ఆశా వర్కర్ల హర్షం

ప్రజాశక్తి – యానాం

తమ వేతనాలు పెంపుపై ఆశా వర్కర్లు హర్షం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద ఆశా వర్కర్లు విలేకరులతో మాట్లాడారు. తమ వేతనాల పెంపుదలలో మాజీ మంత్రి, ప్రస్తుత పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు కషి మరువలేనిదని అన్నారు. తమకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే కాకుండా రూ.6 వేల నుంచి రూ.10 వేల వరకు ప్రభుత్వంతో మాట్లాడి జీతాలు పెంచారన్నారు. ఈ సందర్భంగా మల్లాడి కృష్ణారావుకు, సీఎం రంగసామి, లెఫ్టినెంట్ గవర్నర్, చీఫ్ సెక్రటరీ, ఆరోగ్యశాఖ అధికారులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన అధ్యాపకుల అతిథి ఉపన్యాస శిక్షణ

ప్రజాశక్తి – గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో స్టెల్లా 5.0 అనే అత్యాధునిక అంశంపై అధ్యాపకులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఢిల్లీలోని ఇందిరాగాంధీ టెక్నికల్ యూనివర్సిటీ ఫర్ ఉమెన్స్ సిఎస్‌సి విభాగాధిపతి డాక్టర్ ఎస్.రామనారాయణ రెడ్డి పాల్గొని అధ్యాపకులకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో అధ్యాపకుల సందేహాలను ఆయన నివృత్తి చేశారని డాక్టర్ మేడపాటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రో వైస్ ఛాన్సలర్ అకడమిక్స్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేంష్, డీన్ స్కూల్ అఫ్ ఇంజనీరింగ్ డాక్టర్ డోలా సంజయ్ ఎస్, డీన్ కెరీర్ అండ్ డెవలప్‌మెంట్ జెడి.వెంకటేష్ ,విభాగధిపతి డాక్టర్ కె.స్వరూప, వివిధ విభాగాల విభాగాధిపతులు, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

ప్రజాశక్తి – పెద్దాపురం

ప్రతి ఒక్కరూ వినియోగదారుల హక్కులపై అవగాహన పెంచుకోవాలని జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షులు చెరుకూరి రఘుపతి వసంతకుమార్ అన్నారు. శనివారం మండలంలోని కాండ్రకోటలో జడ్‌పి హైస్కూల్లో జన సంహిత సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో వినియోగదారుల అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవగాహన లేకపోవడం వల్ల నష్టం జరిగినా ఎంతోమంది న్యాయం పొందలేక పోతున్నారన్నారు.

23, 24 తేదీల్లో అభ్యాసకులకు శిక్షణ

ప్రజాశక్తి – గండేపల్లి

సమకాలీన విద్య విధానాలు, పరిశోధన విధానాలపై అధ్యాపకులకు, స్కాలర్స్, పారిశ్రామిక అభ్యాసకులకు 23, 24 తేదీల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు ఆదిత్య డైరెక్టర్ డాక్టర్ ఎన్.సుగుణరెడ్డి తెలిపారు. శనివారం సూరంపాలెం ఆదిత్య గ్లోబల్ బిజినెస్ స్కూల్ ఇందుకు సంబంధించిన గోడపత్రిక ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రముఖ విద్యాసంస్థల నుంచి నిష్ణాతులైన అధ్యాపకులతో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణకు హాజరయ్యే వారు ఆగస్టు 20 నాటికి నిర్దేశిత ఫీజుతో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ఛైర్ పర్సన్‌గా ఎ.విజయభార్గవి, కన్వీనర్‌గా మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ ఎం.గోవర్ధన్ రెడ్డి, కో-కన్వీనర్‌గా ప్రొఫెసర్ పిఎన్‌వివి.సత్యానారాయణ వ్యవహరిస్తారని తెలిపారు.

నాణ్యమైన వరి నారు అవసరం

ప్రజాశక్తి – ఏలేశ్వరం

రైతన్నలకు అధిక దిగుబడులు రావాలంటే నాణ్యమైన వరి నారు అవసరమనిమండల వ్యవసాయ అధికారి బి.జ్యోతి అన్నారు. శనివారం మండలంలోని సిరిపురం గ్రామంలో పొలంబడి కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రైతులకు అవగాహనపై బ్యాలెట్ బాక్స్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె సూడోమోనాస్ శిలీంద్ర, బ్యాక్టీరియా నాసిని ద్వారా విత్తన శుద్ధి, రూట్ డిప్పింగ్ మెథడ్‌లో నారు శుద్ధి గురించి డెమో రూపంలో వివరించారు. ఒక కేజీ విత్తనానికి 8-10 గ్రాములు లేదా పిచికారి విధానంలో ఒక ఎకరానికి కేజీ సుడోమోనాస్‌ను వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యానవన సహాయకులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సందడి చేసిన 'కమిటీ కుర్రోళ్లు' బృందం

ప్రజాశక్తి – పిఠాపురం

జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదల నాగబాబు కుమార్తె సినీనటి నిహారిక నిర్మాణ సారథ్యంలోని 'కమిటీ కుర్రోళ్ళు' చిత్ర బృందం పిఠాపురంలో సందడి చేసింది. ప్రముఖ పుణ్యక్షేత్రం ఉమా కుక్కుటేశ్వర స్వామి, పురుహూతిక శక్తిపీఠాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పూజా కార్యక్రమాలు అనంతరం యూనిట్ బృందం మాట్లాడుతూ ఈ నెల 9న విడుదల కానున్న కమిటీ కుర్రోళ్ల చిత్రం విజయం సాధించాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారిణి దుర్గభవాని, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి – సామర్లకోట

తన గృహంలోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన మున్సిపల్ మాజీ కౌన్సిలర్ గోపు దర్గాభవాని కుటుంబాన్ని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ దవులూరి దొరబాబు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని చెప్పి, దుర్గా భవాని మృతికి దొరబాబు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ పర్యటనలో పెద్దాపురం మున్సిపల్ వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కౌన్సిలర్లు ఆవాల లక్ష్మీనారాయణ, పాగా సురేష్, నాయకులు మద్దాల శ్రీనివాస్, నాగబోయిన రాజబాబు, ఇరుసుమళ్ల సాయి, వాసిరెడ్డి శ్రీను పాల్గొన్నారు.

చంద్రమౌళికి ఘన నివాళి

ప్రజాశక్తి – తాళ్లరేవు

ఇటీవల మృతి చెందిన టిడిపి కోరంగి గ్రామ కమిటీ అధ్యక్షులు వెంటపల్లి చంద్రమౌళికి టిడిపి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో టిడిపి మండల కార్యదర్శి కట్టా త్రిమూర్తులు ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు చంద్రమౌళి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోరంగి పంచాయతీ పరిధిలో పార్టీ అభివృద్ధికి చంద్రమౌళి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జక్కల ప్రసాద్‌బాబు, ఉంగరాల వెంకటేశ్వరరావు, టేకుమూడి లక్ష్మణరావు, పొన్నమండ రామలక్ష్మి, వాడ్రేవు వీరబాబు, మందాల గంగ సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఇన్‌లైన్ క్లోరినేషన్ ద్వారా తాగునీటి సరఫరా

ప్రజాశక్తి – సామర్లకోట

ఇన్‌లైన్ క్లోరినేషన్‌ప్రారంభిస్తున్న బుజ్జి, అధికారులు

హుస్సేన్‌పురం గ్రామంలో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్న లక్ష్యంతో ఇన్‌లైన్ క్లోరినేషన్ ప్రక్రియను చేపట్టారు. శనివారం పంచాయతీ పరిధిలో తాగునీటి సరఫరా పైపులైన్‌లో ఇన్‌లైన్ క్లోరినేషన్ కార్యక్రమాన్ని పంచాయతీ అధికారులు నిర్వహించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్, ప్రధాని మోడీ చిత్రపటాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్య క్షులు చల్లా బుజ్జి, కూటమి నాయకులు కోట అప్పారావు, చల్లా వెంకటరమణ, పలివేల చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి కర్రీ శ్రీనివాస్, వెల్ఫేర్ ఆఫీసర్ వింజమూరి ఆచార్య పాల్గొన్నారు.

వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం

ప్రజాశక్తి – కరప, తాళ్లరేవు

ఎస్‌సి వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని కరపమండల అంబేద్కర్ యువజన సేవా సంఘం అధ్యక్షులు చిన్ను వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక పిహెచ్‌సి ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద సుప్రీంతీర్పుపై నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మండల మాల మహనాడు మాజీ అధ్యక్షులు సవిలే రాజేష్ మాట్లాడారు. అనంతరం తాహశీల్దార్, పోలీస్‌స్టేషన్, ఎంపిడిఓ కార్యాలయాల్లో వినతిపత్రాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి బి.వీరరాఘవులు, మాతా అప్పారావు, మారెళ్ళ వెంకటరమణ, సాదే వీర రాఘవులు పాల్గొన్నారు. అలాగే తాళ్లరేవులో దళితులను వర్గీకరణ పేరుతో విడగొట్టేందుకు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు వెనక్కి తీసుకోవాలని విశ్వజన కళా మండలి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు డిమాండ్ చేశారు. స్థానికంగా జరిగిన సమావేశానికి ఎండిడబ్ల్యూఎ అధ్యక్షులు పెయ్యల రమేష్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో నాయకులు రెడ్డి బాబు, పోతుల రత్నకుమారి, వాకపల్లి చిరంజీవి, పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన సత్యనారాయణ దంపతులు

ప్రజాశక్తి – కాకినాడ రూరల్

మంగళగిరిలోని టిడిపి కార్యాలయంలో సిఎం చంద్రబాబును మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి, నియోజకవర్గ టిడిపి కో-ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనకు వివరించారు. సముద్రతీర ప్రాంతంలో ఉన్న కోరమండల్, జెమిని, అదాని విల్మర్ తదితర పరిశ్రమల వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులతోపాటు, నియోజకవర్గంలోని రమణయ్య పేట, వాకలపూడి, వలసపాకల, చీడిగ, ఇంద్రపాలెం, తూరంగి పంచాయతీలకు పాలకవర్గాలు లేక అభివృద్ధికి నోచుకోవడం లేదని వివరించారు.

పర్యావరణాన్ని పాడుచేసిన వారిపై చర్యలు

ప్రజాశక్తి – జగ్గంపేట

నియోజకవర్గంలోని రామేశ్వరం మెట్టను నాశనం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సర్వజన సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక షాదిఖాన వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము పెట్టిన సంస్థ రాజకీయ చైతన్యానికి కాదని, అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేయాలన్నదే తమ లక్ష్యమని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో కుంచె కొండబాబు, రాజు, సత్యనారాయణ, కుంచె రాంబాబు, కామరాజు, చిన్న రాజులు పాల్గొన్నారు.

దేవాలయానికి రూ 2.24 లక్షల ఆదాయం

ప్రజాశక్తి – పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలో ఉన్న శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒకరోజు రూ.2.24 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాస్ తెలిపారు. వివిధ దర్శనం టిక్కెట్లు ద్వారా రూ.1,40,120, అన్నదాన విరాళాల ద్వారా రూ.64,745, కేశఖండన ద్వారా రూ.3800, తులాభారం ద్వారా రూ.150, లడ్డు ప్రసాదం ద్వారా రూ.15,390 ఆదాయం సమకూరిందన్నారు.

సిఐఎఫ్ఇని సందర్శించిన ఆదిత్య విద్యార్థులు

ప్రజాశక్తి – కాకినాడ

శాస్త్రవేత్తలను మెమోంటో అందచేస్తున్న విద్యార్థులు

స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలకు చెందిన బిఎస్‌సి ఫిషరీస్ అండ్ ఆక్వాకల్చర్ విద్యార్థులు బల భద్రపురంలోని కేంద్రీయ మత్స్య విద్యా సంస్థ (సిఐఎఫ్ఇ) ఫ్రెష్ వాటర్ ఫామ్‌ను సందర్శించారు. తమ కళాశాల విద్యార్థుల క్షేత్ర స్థాయి సందర్శనలో భాగంగా శనివారం ఈ పర్యటన చేసినట్లు ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా సిఐఎఫ్ఇ శాస్త్రవేత్త డాక్టర్ షామ్న, డాక్టర్ శోభ, సాంకేతిక సిబ్బంది విద్యార్థులకు మంచి నీటి చేపల చెరువుల యాజమాన్య పద్ధతులు, సాగు విధానం, వివిధ రకాల మంచి నీటి చేపలు మరియు రొయ్యల సాగులో గల నీటి యాజమాన్య పద్ధతులు, చేప పిల్లల ఉత్పత్తి విధానాలు, మాగూర్ చేప పిల్లల హేచరీ లపై అవగాహన కల్పించారని ఆయన తెలిపారు. ఈ సందర్శనలో మత్స్య శాఖ విభాగాధిపతి డాక్టర్ కె.నరసింహమూర్తి, అధ్యాపకులు మహమ్మద్ అలీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, క్యాంపస్ ఇన్‌ఛార్జ్ ఎన్.మూర్తి అభినందించారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు

ప్రజాశక్తి – కోటనందూరు

రైతులు నిర్దేశించి మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయ అధికారి కె.చంద్రశేఖర్ సూచించారు. శనివారం మండలంలోని కాకరపల్లి గ్రామంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంటల్లో క్రిమిసంహారక మందులు తక్కువగా వాడాలని, సహజ ఎరువు పెంటను అధికంగా వాడితే భూమి యొక్క సారం పెరిగి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులను సాధించవచ్చునని అన్నారు. స్థానిక సర్పంచ్ బంటుపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పెట్టుబడులు ఎక్కువ దిగుమతులు తక్కువగా రావడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

బాల్యవివాహాలపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి – యు.కొత్తపల్లి

మండలంలోని కొనపాపపేట గ్రామంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి దుర్గాదేవి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవ కార్యక్రమం జరిగింది. మానవా అక్రమ రవాణా, క్రిమినల్ చట్టాలు బాల్య వివాహాలపై కళాజాతాలతో బుర్రకథ రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దుర్గాదేవి మాట్లాడుతూ వివాహ సమయం వచ్చే వరకు యువతీ యువకులకు వివాహం చేయరాదన్నారు. నవజాత శిశువుకు తల్లిపాలు ఎంతో ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు అనంతలక్ష్మి, సుజాత, సారమ్మ గ్రామ పెద్దలు కె.వెంకటరమణ, పి.బాపన్నదొర, అప్పారావు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

త్వరలోనే వికలాంగుల ఉపకరణాల పంపిణీ

ప్రజాశక్తి – జగ్గంపేట

త్వరలోనే వికలాంగులకు అవసరమైన ఉపకరణాలను పంపిణీ చేస్తామని ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ అన్నారు. శనివారం ఎంపిపి కార్యాలయంలో వికలాంగుల ఉపకరణాల గుర్తింపు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రకాల వికలాంగులకు ప్రభుత్వం అండగా ఉండేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. వికలాంగులకు అవసరమైన ఉపకరణాలను అందించాలన్నా లక్ష్యంతో ఈ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్‌ఛార్జ్ తుమ్మలపల్లి రమేష్, ఎంపిపి అత్తులూరి నాగబాబు, జడ్‌పిటిసి ఒమ్మి బిందు మాధవి, అప్పలరాజు, మారిసెట్టి భద్రం పాల్గొన్నారు.

మున్సిపల్ షాపులకు తాళాలు

ప్రజాశక్తి – సామర్లకోట

అద్దె బకాయిలను చెల్లించని మున్సిపల్ షాపులకు మున్సిపల్ అధికారులు తాళాలు వేసి సీజ్ చేశారు. స్థానిక రైల్వేస్టేషన్ సెంటర్, బళ్ల మార్కెట్ సెంటర్‌లలో ఉన్న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో పలు దుకాణాలకు చెందిన యజమానులు అద్దెలు సక్రమంగా చెల్లించకపోవడంతో మున్సిపల్ కమిషనర్ జె.రామారావు ఆదేశాలతో శనివారం మున్సిపల్ రెవెన్యూ అధికారులు పలు షాపులను సీజ్ చేశారు. బకాయిలను తక్షణమే చెల్లించాలని షాపుల యజమానులను అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్, ఇన్‌ఛార్జ్ ఆర్ఒ శ్రీరెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ కో ఆప్షన్ సభ్యుడు జానీ మృతి

ప్రజాశక్తి – పెద్దాపురం

విశ్రాంత ఉపాధ్యాయుడు, సంగీత విద్వాంసులు, ఉర్దూ పండితుడు, రచయిత, మున్సిపల్ కౌన్సిల్ మాజీ కో-ఆప్షన్ సభ్యుడు మహమ్మద్ అబ్దుల్ కరీం(98) శనివారం మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన సాహిజామియా మసీదు మాజీ అధ్యక్షులుగా ఎన్నో సేవలు అందించారు. ఆయన మతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

తల్లిపాల వారోత్సవాలు

కరప: స్థానిక సచివాలం -2 పరిధిలోని పేపకాయలపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాన్ని నిర్వహించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో కరప పిహెచ్‌సి వైద్యురాలు డాక్టర్ వి.ఏంజిలిల్ పాల్గొని గర్భిణులు, పాలిచ్చే తల్లులకు తల్లిపాలు ఇవ్వడం వల్ల బిడ్డకి, తల్లికి ఆరోగ్యం పరంగా కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ రెహన్, సిబ్బంది పాల్గొన్నారు.

7 నుంచి భీమేశ్వరస్వామి సర్వ దర్శనాలు

ప్రజాశక్తి-రామచంద్రపురం

పి.తారకేశ్వరరావు, ఇఒ

ద్రాక్షారామ శ్రీ భీమేశ్వర స్వామి ఆలయాన్ని కేంద్ర పురావస్తు శాఖ మరమ్మతుల నిమిత్తం ఏప్రిల్ 20 నుంచి మూసివేశారు. ఆలయంలో శివలింగం మరమ్మతులు పూర్తి కావడంతో ఈనెల 5, 6, 7 తేదీల్లో సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయ ఇఒ పితాని తారకేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనంతరం ఏడో తేదీన ఉదయం 11 గంటల నుంచి యాత్రికులకు సర్వదర్శనాలకు ఏర్పాట్లు చేశామని ఆయన తెలిపారు. యాత్రికులు ఈ నెల 7వ తేదీ నుంచి యధావిధిగా స్వామివారిని దర్శించుకోవచ్చని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

భీమేశ్వరుని హుండీ ఆదాయం రూ. 10.41 లక్షలు

ద్రాక్షారామ శ్రీ భీమేశ్వరస్వామి దేవస్థానం హుండీలను శనివారం లెక్కించారు. మొత్తం రూ.10,41810 ఆదాయం సమకూరిందని ఆలయ ఇఒ పి.తారకేశ్వరరావు తెలిపారు.

బాధితులకు నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి -మామిడికుదురు

వరద ప్రభావిత ప్రాంతమైన అప్పనపల్లిలో శనివారం అల్లవరం మండలం గోడికి చెందిన తాళ్ల సరస్వతమ్మ ముత్యాలు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వరద బాధిత కుటుంబాలకు ఆరు రకాలనిత్యావసర సరుకులతో కూడిన కిట్లు అందజేశారు సుమారు 150 మంది వరద బాధిత కుటుంబాలకు రిటైర్డ్ ఐ ఆర్ ఎస్ తాళ్ల సత్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో ఈ కిట్లు అందజేశారు కార్యక్రమంలో సర్పంచ్ గెడ్డం మంగా లక్ష్మి, అమలాపురం ఎఎమ్‌సి మాజీ చైర్మన్ గునిశెట్టి చినబాబు తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతం పరిశీలన

ప్రజాశక్తి-రామచంద్రపురం

పట్టణంలోని ముచ్చుమిల్లి పరిసర ప్రాంతాలలో వర్షం నీరు దిగక డ్రయిన్లు చెత్తతో నిండి పోవడంతో ముంపు గురవుతున్నాయని, దీని ద్వారా పంట పొలాల్లో నీరు దిగక రైతులు పరిసర ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు మంత్రి వాసంశెట్టి సుభాష్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వెంటనే స్పందించిన మంత్రి ముచ్చిమిల్లి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. వెంటనే ప్రభుత్వ అధికారులకి తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయన వెంట రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'వయనాడ్' బాధితులకు సిపిఎం ఆధ్వర్యంలో సహాయ నిధి సేకరణ

ప్రజాశక్తి-అమలాపురం

సహాయనిధి సేకరిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

కేరళ వయనాడ్ లో కొండ చర్యలు విరిగిపడిన ఘటనలో మతుల సంఖ్య 174 చేరడం బాధాకరమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు రమాదేవి అన్నారు. శనివారం కేరళ వయనాడ్ బాధితుల సహాయార్థం అమలాపురం పట్టణంలో సిపిఎం, ప్రజా సంఘాలతో కలిసి సహాయనిధి సేకరణలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమలాపురం పట్టణంలోని కె.అగ్రహారం, బ్యాంక్ స్ట్రీట్, గడియార స్తంభం సెంటర్లలో దుకాణదారులు, చిరు వ్యాపారులు, బ్యాంకులు, వాహనదారుల వద్ద నుండి కేరళ బాధితుల కోసం సహాయనిధి సేకరించారు. శనివారం అమలాపురం పట్టణంలో సహకరించిన సహాయ నిధికి రూ.10,538 వచ్చినట్లు సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.దుర్గాప్రసాద్, ఎన్.బలరాం కె.కృష్ణవేణి టి నాగ వరలక్ష్మి, ఫీతల రామచంద్రరావు బి శ్రీను, విత్తనాల రాంబాబు, శంకర్, మోహనరావు పొలమూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

యాత్రికులతో కిక్కిరిసిన 'వాడపల్లి'

ప్రజాశక్తి-ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం శనివారం యాత్రికులతో కిక్కిరిసింది. వేకువ జామునే స్వామివారికి సుప్రభాత సేవ, తొలి హారతి అనంతరం యాత్రికులకు దర్శనాలు కల్పించారు. తెలుగు రాష్ట్రాలు ఉండే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి యాత్రికులు వేల సంఖ్యలో రావడంతో ఆలయ ప్రాంగణం అంతా నిండిపోయింది. వచ్చిన యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ డిప్యూటీ కమిషనర్ భూపతి రాజు కిషోర్ కుమార్ అన్ని ఏర్పాట్లను పూర్తి చేసి పరివేక్షించారు. రాత్రి 10 గంటల వరకు యాత్రికుల రద్దీ కొనసాగింది. స్వామివారి దర్శనం అనంతరం యాత్రికులకు ప్రసాద వితరణ భారీ స్థాయిలో అన్నదానం నిర్వహించారు.

'పిఎం సూర్య ఘర్'ను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-అమలాపురం

కేంద్రం బలహీన వర్గాల అభ్యున్నతి కోసం గృహ విద్యుత్ వినియో గదారుల కొరకు ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకాన్ని ప్రవేశపెట్టిందని, ఆ పథకాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. రాష్ట్ర తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ కార్పొరేషన్ లిమిటెడ్ వారినీ నోడల్ ఏజెన్సీగా నిర్ణయించి ప్రవేశపెట్టిన ఈ పథకం అమలు విధానంపై రూపొందించిన పోస్టర్‌ను శనివారం కలెక్టర్ ఛాంబర్ నందు జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.

IN THE COURT OF THE VII ADDITIONAL DISTRICT JUDGE: PEDDAPURAM

E.P. 17/2022 In I.A. 971/2017 In O.S. 166/2013

Between:
Kadali Lakshmi Kumari ...Decree Holder
And
Koppisetty Ravi Seshu Kumar and 3 others .. Judgment Debtors

JDr's
1) Koppisetty Ravi Seshu Kumar, S/o. (late) Prabhakara Rao, Aged 60 years, D.No.79-18-10, Omkar Street, Opp. Sai Baba Street, Tilak Road, Rajahmundry
2) Koppisetty Srinivasa Rao, S/o. (late) Prabhakara Rao, Aged 55 years, D.No.22-9-3, PVSN Enclave, Kambala Cheruvu, Korukonda Road, Veerabhadra puram, Rajahmundry
3) Koppisetty Venkat, S/o. (late) Prabhakara Rao, Aged 50 years, D.No.79-18- 10, Omkar Street, Opp. Sai Baba Street, Tilak Road, Rajahmundry
4) Chitturi Padma, W/o. Krishna Rao, C/o. Koppisetty Ravi Seshu Kumar, Aged 53 years, D.No.79-18-10, Omkar Street, Opp. Sai Baba Street, Tilak Road, Rajahmundry

సదరు పై నెంబరు గ్రంథమున శ్రీకోర్టువారు మీకు ఎన్నిసార్లు సమన్లు జారీ చేయించినప్పటికీ ఉద్దేశ్యపూర్వకముగా తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున మీరు ది.28-08-2024 సం॥ తేదీన ఉదయం 10.30 ని॥లకు పై కోర్టువారి ఎదుట హాజరుకావలయును. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

KATTA BAHUDEVATA PRATAP KUMAR, BATHALA NARESH, Advocates,
D.No.9-11-23, Flat-4, R. K. Apartment, Nookalamma Temple Street, Gandhi Nagar, Kakinada-4. Ph.98480 36321
పెద్దాపురం
04-08-2024

మహారాజశ్రీ కాకినాడ 6వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

G.O.P. 81/2023

మధ్య:
బాకి త్రివేణి, వగైరాలు -పిటీషనర్లు
AND
బాకి గీతా గాయిత్రి -రెస్పాండెంటు

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా, బాకి త్రివేణి గారు వారిని ఇందులోని 3 మరియు 4 మైనరు పిటిషనర్లుకు గార్డియన్‌గా నియమించి వారి ఆస్తులను మైనర్లు ప్రయోజనార్థం అమ్ముటకు పర్మిషన్ ఇప్పించమని కోరి ప్రార్థించుచూ GOP 81/2023 గా పిటీషను దాఖలు చేసినారు. ఎవ్వరికైనా ఏమైనా అభ్యంత రాలు ఉన్న ది. 13-8-2024 ఉదయం 10.30 నిమిషములకు కాకినాడ 6వ జిల్లా కోర్టులో హాజరు అయి తెలుపవచ్చును. లేనిచో ఏ అభ్యంతరములు లేనట్లుగా పరిష్కరింపబడునని తెలియజేయడమైనది.

schedule

East Godavari / Kakinada District, Kakinada Sub-registry, Kakinada Corporation limits, S.No.259/1, Block No.23, Ward No.4 thatched house with site bearing DNo.23-2-3/1 total site add measuring 79.54 sqyards or 66.50m sqmeters within the following boundaries. Comprised in to 2 items.

Item No.1: Thatched house bearing DNo.23-2-3/1 within the following boundaries add measuring 66.59 sq yards.
East : Wall belongs to Manukonda Surireddy.
West : Item No.2 belongs to Baki Geeta Gayatri and Sundari.
South : House of Saragada Gruhalaxmi.
North : House belongs to Baki Suri Babu.
With all easement rights.

Item No.2. The property in possession of respondent add measuring 12-75 sq yards within the following boundaries.
East : Item No.1 fell to the share of petitioners 1,3 and 4.
West : Municipal Road,
South : House bearing No.23-2-3/2 in possession of 2nd petitioner.
North : House bearing DNo.23-2-3/2 belongs to G.Yerrayyamma.
with all easement rights.

వై.శ్రీరాములు
అడ్వకేట్, కాకినాడ
కాకినాడ
3-8-2024
సెల్: 9701857162

సామర్లకోట పురపాలక సంఘం

ఇంజనీరింగ్ విభాగము

ఆర్.ఒ.సి. నెం.418/2024-ఇ1. తేది.03-08-2024

"ఇ" ప్రొక్యూర్‌మెంట్ షార్టు టెండరు నోటీసు

సామర్లకోట పురపాలక సంఘం బిపిఎస్ మరియు ఎల్ఆర్ఎస్ నిధులతో ఇ.సి.వి రూ.25.56 లక్షలుతో 4 పనులను చేయుటకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ పద్ధతిని ఆన్‌లైన్ ద్వారా టెండర్లు కోరబడుచున్నవి.

1. షెడ్యూల్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది : ది.03-08-2024 మధ్యాహ్నం గం.3.00 ల నుండి
2. టెండర్లు స్వీకరణకు ముగింపు తేది : ది.07-08-2024 ఉదయం గం.10.30 ల వరకు

తదుపరి వివరాల కొరకు www.eprocurement.gov.in నందు 'e' ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ వెబ్‌సైట్ నందు పొందవచ్చు.

సం/- కమిషనరు,
సామర్లకోట పురపాలక సంఘం